నాకు నీ మొండిపట్టుదల తెలుసు. నువ్వు తిరిగి నా జీవితంలో ప్రవేశిస్తావనే ఆశకూడా లేదు. మళ్ళీ ఒంటరి బ్రతుకు! నా చీకటిబ్రతుకులో అప్పుడప్పుడు మెరుపులు మెరుస్తున్నాయి. ఆ వెలుగు శాశ్వతం కావటంలేదు. నా చీకటి ప్రయాణానికి దారి చూపిస్తున్నాయి. కాని ఒక్క చీకటి బ్రతుకులోనైనా శాశ్వతమైన వెలుగును నే నివ్వగలిగితే నా బ్రతుక్కి అంతకంటె పరమార్థ ముందనుకోను. అందుకే అనాథ శరణాలయంనుండి పాపను తీసుకొచ్చాను. పేరేమిటో తెలుసా! 'ప్రేమావతి' మా అక్కయ్యపేరు. ఆ పాప జీవితాన్నైనా తీర్చి దిద్దగలిగితే నా కదే తృప్తి. ఇక మన బాబంటావా! వాడికేం! ఒక్క తండ్రి లేడన్నమాటే గాని గారాంచేసే తాత, మామ్మా వున్నారు. కష్టసుఖాలు చూసేందుకు ముఖ్యంగా నువ్వున్నావ్!

ఒక్కొక్కసారి అనిపిస్తుంటుంది రాజ్యం! నా జీవితంలో నేను చేసిందేమిటి? అసలు నేనెటు పయనిస్తున్నాను? ఏం సాధించాను?

డబ్బు సంపాదించానా? కేవలం తిండికీ బట్టకీ సరిపోయే సంపాదన.

కీర్తి సంపాదించానా? రూపాయికోసం ఆదర్శాల్ని అక్షరాలుగా మార్చి అమ్ముకుంటున్నాననే పేరు. ఇది కీర్తా?

ప్రేమ సంపాదించానా? నన్నే కావాలని ఎంచుకుని ప్రేమించి పెళ్ళిచేసుకున్న నీకు నేనేం యిచ్చానని గుండెకోత తప్ప!

నా మీద నాకే అసహ్యం వేస్తుంది. మానసికంగా నాలో ఏదో వేదన. నువ్వూ నేనూ కలిసి తిరిగిన ప్రదేశాలు! ఇంటిలోని ప్రతి వస్తువూ అనుక్షణం నిన్ను గుర్తుకుతెచ్చి గుండెకోత కోస్తున్నాయి. మద్రాసు వదిలి మరెక్కడికైనా పోదామనిపిస్తుంది. ఎక్కడికెళతానో నాకే తెలీదు. అందుకే యీ ఉత్తరం రాస్తున్నాను. పెద్దయ్యాక మన బాబుకి చెప్పు 'నీ తండ్రి మోసగాడు కాదూ, జీవిత గమనంలో ఒంటరిబ్రతుక్కి భయపడి భయపడి పారిపోయాడని!'

నా యీ ఉత్తరంలో ఓ అనాథ బాలిక ఆర్తనాదం వినిపిస్తే ఒక కన్నీటి బిందువు విడువ్! అదే సంతృప్తి!

ఎక్కడున్నా నీ మేలు కోరే!
ఒక అగమ్య బాటసారి
కరుణాకరం."

రాజ్యలక్ష్మికి తెరలు తెరలుగా ఏడుపొచ్చింది.

"లేదు కరుణా! నేనే మూర్ఖంగా ప్రవర్తించాను. జీవితంలో అలిసిపోయిన నీకు ఓదార్పునివ్వాల్సింది పోయి పంతానికిపోయి నిన్ను మరింత చిత్రవధ చేశాను. వస్తున్నాను కరుణా! నా ఒడిలో నీకు సేద తీరుస్తాను! నువ్వు నీరుపోసే చిన్ని మొక్కకు నేను జీవితాన్నిస్తాను" అనుకుంది రాజ్యలక్ష్మి.

---



# పొగమంచు

## శీలంశెట్టి రమాదేవి

చలిగాలి విడిలించి కొడుతోంది.

పొగమంచు ఇంకా ఆవరించేవుందా ప్రాంతమంతా!

ఎప్పటికి విడిపోతుందది?

శారద బాల్కనీలోనుంచి గదిలో కొచ్చి బాల్కనీ తలుపులు మూసేసింది.

గదిలో వెచ్చగా - రగ్గు కప్పుకున్నట్లుంది.

శేఖర్ ఇంకా నిద్రపోతూనే వున్నాడు లోపల! ఉయ్యాలలో పాపాయి కూడా ఇంకా నిద్రలేవలేదు.

శారద వంటింటివేపు నడిచింది.

కాఫీ తయారుచేస్తుంటే మళ్ళీ రాత్రి జరిగిన వివాదం గుర్తుకొచ్చింది.

"శారదా! ఇవాళ నీతో కొంచెం మాట్లాడాలి!". అన్నాడు శేఖర్ రాత్రి పడుకునే సమయంలో.

తన కేదో భయంవేసింది. అయితే అది పైకి తెలియనీలేదు.

"ఏమిటి?" అడిగింది ఆసక్తితో.

"చాలా రోజుల్నుంచీ నీతో చెప్పాలని కూడా చెప్పలేక ఊరుకుంటున్నాను. కానీ నాకే రాత్రాను 'నటించటం' చిరాకు గలిగిస్తోంది. చిన్నప్పటినుంచీ నేను 'నటన' లేకుండా పెరిగాను. అమ్మా నాన్నను నన్ను ఎంకరేజ్ చేశారు. నేనేం తప్పుచేసినా నన్ను మందలించి

వదిలేసేవారు. కానీ అబద్ధ చెప్తేమాత్రం చాలా దారుణంగా హింసించేవారు. మనసులో నా ఫీలింగ్స్ ఉన్నదున్నట్లు చెప్తే- అవి తప్పయినా, అభ్యంతరకరమయినవయినా - 'శెభాష్' అనేవారు. అలాంటి బాక్‌గ్రౌండ్‌లో. పెరిగి పెద్దదయాను. ఉద్యోగం చేసేచోట కూడా అందువల్ల నాకెలాంటి సమస్యలూ రాలేదు. అంచేత నటించే అవసరం రాలేదు...."

శారదకు అతనేం చెప్తున్నాడో, ఇదంతా ఎందుకు చెప్తున్నాడో ఏమాత్రం అర్థంకావటంలేదు. అయినా అతనిని ఆ విషయం ప్రశ్నించలేకపోయింది.

"కానీ- మన పెళ్ళయాక నేను నటించాల్సిన అవసరం ఏర్పడింది శారదా! నటించటం- అబద్ధాలు చెప్పటం- అన్నీ నీ మూలాన అలవాటు చేసుకున్నాను-"

శారద విస్తుపోయింది. ఆమె ముఖంలో ఆశ్చర్యం, కోపం రెండూ చోటుచేసుకున్నాయి.

"నా మూలానా?" అడిగిందామె.

"అవును!"

ఏం చెయ్యలేక నవ్వేసింది.

"బాగుంది! అలా చేయమని నే నెప్పుడైనా చెప్పానా మీకు?"

"చెప్పావ్?"

ఉలిక్కిపడింది.

"నేను చెప్పానా?"

"అవును!"

"ఎప్పుడు?"

"నేనూ మా ఆఫీస్‌లో పనిచేసే మాధవీ- సినిమా కెళ్ళినరోజున!"

స్టౌమీద పాలు పొంగి స్టౌ ఆరిపోయింది.

శారద చప్పున గ్యాస్ 'ఆఫ్' చేసి పాలు, కాఫీ డికాక్షన్ కలుపుతుంది. కప్పు నిండుగా కాఫీ నింపుకుని వంటింటి కిటికీదగ్గరకెళ్ళి నిలబడింది.

పొగమంచు ఇంకా థిక్‌గానే ఉంది.

మిస్టర్ అండ్ మిసెస్ రాజన్ మార్నింగ్ వాక్ కెళ్ళి తిరిగి వస్తున్నారు లాన్స్ మధ్యనుంచి!

మిసెస్ రాజన్ ఏదో విషయం అభినయంతోసహా వివరిస్తోందతనికి. ఇద్దరూ కలసి ఎప్పుడు కనిపించినా అంత ఆసక్తితోనూ—అంత ఆప్యాయంగానూ- మాట్లాడుకుంటారు. మరి వాళ్ళమధ్య నటనా, అబద్ధం- ఇవేమీ ఉండవా?

కాఫీ వెచ్చగా శరీరంలోకి ప్రవహిస్తోంది.

శేఖర్ ఆ మాటనేసరికి తను నిర్ఘాంతపోయింది,

"నేనూ మా ఆఫీస్‌లో పనిచేసే మాధవీ సినిమా కెళ్లినరోజున."

ఆ రోజుని తను ఇంకా మనసులోనే ఉంచుకుంది. మర్చిపోలేదు. ఎలా మర్చిపోతుంది?



తను అతనింకా ఆఫీస్‌నుంచి రాలేదేమిటా అని ఆదుర్దాపడుతూ కిటికీలోనుంచి గేటువేపు చూస్తూనే ఉంది.

రాత్రి తొమ్మిదింటికి గేటుముందు ఆటో ఆగింది.

అందులోనుంచి శేఖర్ దిగాడు. ఆమె బయటకు తలపెట్టి చేయి ఊపింది. అతనూ చేయి ఊపాడు.

ఆటో వెళ్ళిపోయింది.

తను నిశ్చేష్టురాలయింది. తన సర్వస్వం పోగొట్టుకుంటున్నట్లు అనిపించసాగింది.

చప్పున కిటికీదగ్గరనుంచి తప్పుకుంది అతనికి కనిపించకుండా!

అతను తలుపు తట్టాడు.

తడబడుతున్న అడుగులతో వెళ్ళి తలుపు తీసింది.

"సారీ శారదా! లేటయిపోయింది. నువ్వింకా నిద్రపోలేదా!" అడిగాడతను బట్టలు మార్చుకుంటూ.

"లేదు!" పొడిగా అంది తను.

లోపల్లోపల అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయ్.

అతను భోజనం చేస్తుంటే ఎదురుగ్గా కుర్చీలో తనూ కూర్చుంది.

"ఏమయిందంటే — ఇవాళ మా ఆఫీస్‌లో మా పక్క సీట్ అమ్మాయి లేదూ? అదే - మాధవి అని చెప్తుంటాను చూడు! ఆ అమ్మాయిది బర్త్‌డే అట ఇవాళ! సినిమాకు తీసుకెళ్ళమని అడిగింది. నాతో క్లోజ్‌గా ఉంటుంది కదా! ఇద్దరం సినిమాకెళ్ళాం!"

తనకేం మాట్లాడాలో తెలీటంలేదు. అతనెలాగో ఆలస్యానికి ఏదోఒక కుంటిసాకు చెప్తాడనీ అప్పుడు పదుదకు పదాలనీ అనుకుంది.

కానీ భార్య కటువంటి విషయం చెప్తే నానా గొడవా చేస్తుందన్న ఇంగితమయినా లేకుండా—

భోజనం అయిపోయేవరకూ మాధవి గురించే మాట్లాడాడతను. అంతకుముందు కూడా మాధవి గురించీ- తామిద్దరూ షాపింగ్‌కి వెళ్ళటం గురించీ — అనేక సార్లు చెప్పాడు గానీ తను అంతగా పట్టించుకోలేదు!

ఇప్పుడు మాత్రం అతనిని మాధవి తననుంచి విడదీస్తున్నట్లు అనిపించసాగింది.

"శారదా!" ఆ రాత్రి తనను అతనివేపు తిప్పుకుంటూ మృదువుగా పిలిచాడు.

తను విసురుగా అతని చేతిని తోసివేసింది.

"డోంట్ టచ్ మి...."

"అరె! ఇంతలోకే ఏమయిపోయింది?" బలవంతంగా అతనివేపు తిప్పుకున్నాడు.

"మీకు అంత క్లోజ్ అయితే దాన్నే చేసుకోవలసింది...."

"మై గాడ్! మాధవితో సినిమా కెళ్ళినందుకు ఇంత కోపమా?"

"ఇవాళ సినిమా కెళ్ళారు- రేపు వేరే కాపురం పెడతారు-"

అతను నవ్వాడు.

"అందుకు 'లా' ఒప్పుకోదులే! ఖంగారుపడకు-"

"మీలాంటి తెగించినవాళ్ళను 'లా' ఏమీ చేయలేదు. అయినా దాని కేదం రోగం? పెళ్ళయిన మగాళ్ళతో వెధవ్వేషాలేసే బదులు ఎవర్నో పెళ్ళి చేసుకుని సంసారం చేయగూడదూ?"

"శారదా! నువ్ దీనికి ఇంత అప్సెట్ ఎందుకవుతున్నావో నాకు తెలీదు. మాధవి గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మాత్రం నాకు నచ్చదు."

"అవునవును! ఎందుకు నచ్చుతుంది? పెళ్ళాంకంటె ఎక్కువయి పోయింది!" ఏడ్చేస్తూ అందామె రోషంగా.

"అది నీ భ్రమ! అయినా నువ్వింత 'నారో'గా ఆలోచిస్తావని తెలిస్తే నీకీ విషయం చెప్పేవాడినే కాదు!"

"చెప్పకపోయినా ఇలాంటి విషయాలు దాగవు! - మీ కంత ఇష్టంలేనివాళ్ళ నన్నెందుకు చేసుకున్నారసలు?"

అతను తన తల రెండుచేతుల్తోనూ పట్టుకూర్చున్నాడు.

"నీతో ఇంక మాట్లాడడం వృథా!" అన్నాడు కొద్దిక్షణాలాగి.

"నిజం చెప్పండి! మీకు దానితో ఏ సంబంధమూ లేదూ?"

అతను కొద్ది క్షణాల తర్వాత మాట్లాడాడు. "లేదు!"

అప్పుడుగానీ శాంతించలేదు తను.

ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ మాధవి గురించి తన దగ్గర చెప్పలేదతను. ఆ రోజు తనలా గొడవచేయబట్టే తన సంసారం నిలబడిందని సంతృప్తి పడింది తను.

కాఫీ- నిన్న రాత్రి—

కాఫీకప్పు ఖాళీ అయిపోయింది.


పొగమంచు అంతా విడిపోయింది. దూరంగా రోడ్డుమీద బస్‌లు, ఆటోలు, కార్లు తిరగటం కనబడుతోంది.

శారద వంటింట్లోకి నడిచి కప్పు టేబిల్ మీదుంచి, మిగతా కాఫీ ఫ్లాస్కులోపోసి హాల్లోకి నడిచి సోఫాలో కూర్చుంది.

రాత్రంతా ఆలోచించి నిర్ణయం తీసుకుంది తను.

అతనికి తనతో కాపురం చేయటం ఇష్టంలేకపోతే- అందుకు తనకేమీ అభ్యంతరం లేదు.





అతను మాట్లాడిన మాటలు ఎంచేతో ప్రతి అక్షరం గుర్తుండిపోయింది.

"....కనుక శారదా! ఆ రోజు మాధవి విషయంలో నువ్ చేసిన గొడవ మూలాన నీ అంతరంగం అర్థమయింది నాకు! నువ్వు చదువుకున్నావన్న మాటే గానీ- అన్ని విషయాలలోనూ మిగతా దేశవాళీ స్త్రీలకున్న లాంటి మనస్తత్వమే నీదీనూ! సెక్స్ అనేది కేవలం - అది భార్యాభర్తలమధ్య ఉండేదే పవిత్రం- శీలం లేని ఆడదాని జీవితం వృథా! ఒక ఆడదానికి ఒకడే భర్త - ఒక మగాడికి ఒకతే ఆడది లాంటి నికృష్టమయిన నమ్మకాలు నీలోనూ జీర్ణించుకు పోయాయ్! నా అభిప్రాయాలు అందుకు పూర్తిగా విరుద్ధం! నేను కోరుకునే అమ్మాయి నన్ను కోరుకుంటున్నప్పుడు- సెక్స్ అనుభవిస్తే అందులో తప్పేమీ లేదు.

నిజానికి మాధవికీ నాకూ శారీరక సంబంధం ఉంది! అది తప్పని మే మిద్దరమూ అనుకోవటంలేదు

అలాగే నా భార్య కూడా తనకి మరీ ఇష్టమయిన ఓ వ్యక్తితో సంబంధం పెట్టు

కున్నా నేను పట్టించుకోను. అభ్యంతరం చెప్పను!

మనిద్దరి పరస్పర విరుద్ధ భావాలవల్ల 'నేను మాధవి విషయంలో - నా అంత వాటుకి - నా ప్రిన్స్‌పుల్స్‌కి - వ్యతిరేకంగా నీకు అబద్ధాలు చెప్పడం ప్రారంభించాను! మాధవీ నేనూ కలుసుకోవటం సినిమాలకూ, షికార్లకూ తిరగటం- నీకు తెలీకుండా నటిస్తున్నాను

కానీ ఇలా ఎంతకాలం ఈ దాగుడు మూతలు? నాకే నా మీద అసహ్యంగా ఉంది! ఇలాంటి ద్వంద ప్రవృత్తి నాకు నచ్చదు. నేనలా పెరగలేదు.

అందుకే ఇవాళ దానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించుకున్నాను—

శారదా! మరో స్త్రీతో సెక్స్ నేను తప్పుగా భావించను! అసలు సెక్స్‌అనేది మన మిగతా శారీరక అవసరాల్లో ఒకటి- అంతకంటె ఎక్కువ సెంటిమెంట్ అనవసరమని నా అభిప్రాయం!

నాకూ మాధవికీ సంబంధం ఉంది ఇకనుండి కూడా ఉంటుంది. ఈ విషాన్ని నువ్వు అంగీకరించి రాజీ పడేట్లయితే- మన సంసారం సాఫీగా సాగుతుంది! లేదా విడిపోదాం. అదీ నువ్వు కోరుతేనే! నా మటుకు నాకు నిన్ను వదులుకోవటం ఇష్టంలేదు! నీమీద ఇదివరకటి ప్రేమానురాగాలూ తగ్గలేదు. ఎటొచ్చీ— ఈ అబద్ధాలు, నటనలూ - నేను భరించలేను! నేను చెప్పింది అర్థమయిందనుకుంటాను! నువ్వే ఆలోచించి నీ నిర్ణయం చెప్పు!"

ఆ విషయం చెప్పి అతను నిద్ర పోయాడు.

ఆ క్షణంనుంచీ తనలో ఆలోచనలు మొదలయినాయ్! ఉదయంవరకూ ఆలోచనలతోనే సతమతమయిపోయింది! మధ్యలో కోపం వచ్చింది! ఏడుపొచ్చింది, విరక్తి కలిగింది. వాటన్నిటి తర్వాత తెల్లవారుతుండగా ఆవరించిన ప్రశాంతతలో నిర్ణయం తీసుకుంది.

శేఖర్ నిద్ర లేచి హాల్లోకి వచ్చాడు.

"నేను చెప్పింది ఆలోచించావా శారదా?"

"ఆలోచించాను!"

"ఏమి నిర్ణయించుకున్నావ్ మరి?" ఆమె పక్కనే కూర్చుంటూ అడిగాడు.

"మీరు కోరినట్లే విడిపోవటం మంచిది...."

"సరే. నీ ప్రోగ్రాం ఏమిటి మరి? ఏం చేయాలనుకుంటున్నావ్?" అడిగాడతను.

"ఏమో! అసింకా ఆలోచించలేదు!"

"ఓకే! నా సంగతి చెప్తాను! నేను కాసేపట్లో ఇంటినుంచి వెళ్ళిపోతాను! ఈ ఫ్లాట్ నీకే వదిలేస్తున్నాను. ఎలాగూ నీ పేరుమీదే ఉంది గనుక ప్రాబ్లంలేదు!





ఇదిగాక నీకు ప్రతినెలా కొంత మొత్తం వచ్చేట్లుగా బాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ వేస్తాను— ఈజిట్ ఓకే!"

ఆమె తలూపింది.

అతను మరికాసేపట్లో తన రెండు సూట్‌కేస్‌లూ తీసుకుని వెళ్ళడానికి రడీ అయాడు.

"నా ఆఫీస్ ఫోన్‌నెంబర్ తెలుసు కదా! ఎప్పుడయినా అవసరమొస్తే...."

తను తలూపింది.

ఉయ్యాల దగ్గరకు నడిచి పాపాయిని ముద్దు పెట్టుకున్నాడతను.

తరువాత తన దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"సారీ శారదా! ఇది నా నిర్ణయం కాదు! వీసీ! స్టిల్ ఐ లవ్ యూ-" అనేసి వెళ్ళిపోయాడు.

తను కదలిక లేకుండా హాల్‌మధ్యలో నిలబడిపోయింది.

హఠాత్తుగా పాపాయి ఏడుపు వినబడ సాగింది.

అయినా అక్కడినుంచి కదలలేక పోతోంది! ఏదో శక్తి తనను కదలకుండా బంధించినట్లు అనిపిస్తోంది.

తన నిర్ణయం సరయినదేనా?

పక్క ఫ్లాట్‌లో ఉన్న మిస్టర్ అండ్ మిసెస్ రాజన్ సంసారం సంగతేమిటి?

ఆమె పుట్టింటికెళ్ళినప్పుడు అతను రోజుకో అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చి రాత్రంతా గడిపి పంపిస్తూండేవాడు.

మరో ప్రక్క ఫ్లాట్‌లో మహీధర్- భార్య ఆఫీస్‌కెళ్ళిన సమయంలో పనిమనిషితో ప్రణయం జరపటం తనకు తెలుసు!

ఎవరి సంగతో ఎందుకు?

తన స్వంత అన్నయ్య సంగతేమిటి? అతనికి - ఒకప్పుడు తమ ఇంట్లో అద్దె ఉండి ప్రస్తుతం వైజాగ్‌లో ఉంటున్న మహేశ్వరికీ - ఇప్పటికీ సంబంధం ఉంది! తరచుగా అందుకే వైజాగ్ వెళ్తూంటాడతను

మరి తన వదినకి విషయం తెలీదు.

వీళ్ళందరూ ఇంట్లో భార్యలదగ్గర ఆ విషయం చెప్తున్నారా? లేదు! అనుక్షణం నటిస్తున్నారు. పరాయిస్త్రీ తల్లితో సమానమన్నట్లు పోజులు పెడుతున్నారు. భార్యే సర్వస్వం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

వాళ్ళ సంసారాల్లో ఎలాంటి కలతలూ లేవు! ఎలాంటి అనుమానాలూ లేవు.

ఎందుకంటే వాళ్ళ భార్యలకు ఆ విషయాలు తెలీవు కాబట్టి!

తెలిస్తే ఊరుకుంటారా?

ఏమో!—ఊరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.

లేకపోతే కాపురాలు కూలదోసుకుంటారా?

ఊహూం!

తనూ- శేఖర్ మాధవిల విషయం—

చూచాయగా తెలిసినా కూడా సహించింది కానీ అది ఓపెన్‌గా, తన అనుమతితో జరగాలనేసరికి - సహించలేకపోయింది.

ఎందుకని?

పాపాయి ఏడుపు వినబడుతూనే ఉంది.

మహీధర్ భార్య ఆఫీసుకెళ్ళటానికి- తలుపు తీసుకుని బయటకొచ్చింది.

వెనుకే ఆమె భర్త__

"మా ఫ్రెండ్ వస్తానన్నాడు! వచ్చాక ఇద్దరం కలిసి వెళ్తాం-" చెప్పాడతను ఆమెతో.

"ఓకే - సాయంత్రం మా ఆఫీస్ దగ్గరకొస్తారు కదూ!"

"ష్యూర్-"

ఆమె వెళ్ళిపోయింది.

కనుమరుగయేంతవరకూ చూసి అతను తలుపులు వేసేసుకున్నాడు.

లోపల్నుంచి పరిచితమయిన నవ్వులూ- సరససల్లాపాలూ- మామూలే-

అతనికీ పనిమనిషికీ సంబంధం ఉందని అతని భార్యకు తెలుసు!

అయినా తెలీనట్లు ఆమె నటన!

సంబంధం లేదన్నట్లు అతని నటన!

ఎందుకిదంతా! ఏమిటిదంతా?

ఆ నటనే వద్దంటున్నాడు శేఖర్.

తను కావాలంటోందా? తరతరాల నుంచీ బూజుపడుతూ వస్తోన్న నమ్మకాలు!

ఊహు! కావాలనటంలేదు! కానీ తనకి తెలిసేట్లు జరగడానికి వీల్లేదంటోంది.

ఎందుకని? ఎందుకంటే-ఎందుకంటే హిపోక్రసీ మన దేశాన్ని ఏనాటినుంచో ఏలుతోంది కనుక! అందరూ దానికి బానిసలు కనుక!


అది ఉన్నవాళ్ళకే అన్ని సుఖాలూనూ!

వద్దనుకునేవాళ్ళు, లేనివాళ్ళు శేఖర్‌లా, తనలా ఒంటరిగా ప్రయాణించాల్సిందే!



# ఎండ

పాలకూర సీతాలత



పార్వతీశంగారు కిటికీలోంచి రోడ్డు మీదకు చూశారు. ఉదయం పది గంటలు కాకపోయినా ఎండ మాత్రం చాలా తీవ్రంగా ఉంది. 'ఏడాదికీ ఏడాదికీ ఎండలు పెరిగిపోతున్నాయి.... దొంగ వ్యాపారిలోని దురాశ లాగ....' అనుకుని చిన్నగా నిట్టూర్చారు. ఊరు పెరుగుతున్నందువల్ల చెట్లన్నీ కొట్టివేస్తున్నారు. అది కూడా ఒక కారణమే.

ఆయన ఈ మధ్యే రిటైర్ అయ్యారు. పదవీబాధ్యతలనుంచి ఆయనకు విముక్తి లభించినా, సంసారపు బాధ్యతలనుంచి మాత్రం విముక్తి లభించలేదు. ఆయనకు ఇద్దరు కొడుకులు- ఇద్దరు కూతుళ్ళు.

పెద్దకొడుకు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి పెళ్ళి కూడా అయ్యింది. అందువల్ల అతని నుంచి ఆయనకు ఏ

**1984 చక్రపాణి తృతీయ అవార్డు పొందిన కథ**